# 'సంస్కృతి'కి బాలగోపాల్ జవాబు

## ఉత్తరాలు

సంస్కృతిగారి ఉత్తరం (జనవరి 30) చదివాను.

చైనా సాంస్కృతిక విప్లవాన్ని గురించి ప్రతిపాదించినప్పుడు తిరస్కరించిన విమర్శను, తూర్పు యూరప్ పరిణామాలను విశ్లేషించేటప్పుడు నేనే ప్రతిపాదించడానికి కారణం ఆ రెండింటి మధ్య వున్న తేడాలోనే ఉంది. నిజానికి ఈ విమర్శలోని ముఖ్య అంశాలకు ఆచరణాత్మకంగా సమాధానం చెప్పే ప్రయత్నమే చైనా సాంస్కృతిక విప్లవం. అది పూర్తిగా (ఆ మాటకొస్తే సగం కూడా) విజయవంతం కాలేదన్నది వాస్తవమే. అంతమాత్రం చేత అన్నిటినీ ఒకే గాటిన కట్టి విమర్శించడం న్యాయం కాదు. పాశ్చాత్య విమర్శకులు చేస్తున్న పని ఇదే. అన్ని కమ్యూనిస్టు పార్టీలనూ అన్ని సోషలిస్టు ప్రయోగాలను ఒకే గాటిన కట్టి దూషించడం. కానీ వాస్తవానికి చైనా అనుభవానికీ తూర్పు యూరప్ అనుభవానికీ చాలా తేడా వుంది. 1920—30 దశాబ్ద కాలంలో సోవియట్ రష్యా ప్రపంచలోని అభ్యుదయవాదులందరికీ ఎంతటి ఉత్తేజాన్ని ఇచ్చిందో తిరిగి అంతటి ఉత్తేజాన్ని 1960—75 కాలంలో చైనా కల్పించింది. తూర్పు యూరప్ దేశాలు ఎవరికీ ఎన్నడూ ఏ ఉత్తేజాన్నిఇవ్వలేదు.

తాము అధికారానికి వచ్చిన తరువాత ఇక ప్రజా ఉద్యమాలతో పనిలేదని తూర్పు యూరప్ పాలకులు భావించారు. చైనాలో అందుకు భిన్నంగా విప్లవానంతరం అనేక ప్రజా ఉద్యమాలు జరిగాయి. లక్షల సంఖ్యలో జనం వాటిలో పాల్గొన్నారు. ఈ ఉద్యమాలలో ఏవి కమ్యూనిస్టు పార్టీ ప్రోత్సాహంతో జరిగాయో ఏవి కమ్యూనిస్టు పార్టీతో నిమిత్తం లేకుండా జరిగాయో చెప్పడం కూడా కష్టం అని జి.పి. దేశ్పాండే ఈ మధ్య ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో రాస్తూ అన్నారు. అంతేగాక ప్రణాళికా రచన నుండి పరిపాలనా నిర్వహణ దాకా అన్నీ కూడా చైనాలో తూర్పు యూరప్ దేశాలతో పోలిస్తే చాలా వికేంద్రీకృతంగా సాగాయి.

ఆర్థిక, రాజకీయ రంగాలు సంక్షోభంలో పడ్డప్పుడు ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, ఏ సమస్యా లేదని బుకాయించడం తూర్పు యూరప్ ప్రభుత్వాలు చేసిన తప్పు అని విమర్శించాను. మావో అందుకు భిన్నంగా, పార్టీలో బ్యూరోక్రాటిక్ ధోరణులూ, తిరోగామి శక్తులు ప్రబలినప్పుడు, ఆ విషయాన్ని దాచిపెట్టి పార్టీ లోపల మూఠా తగాదాలకు తావిచ్చే బదులు ప్రజల ముందు వాస్తవాన్ని పెట్టి పార్టీ మీదే తిరగబడమన్నాడు. స్టాలిన్ కాలం నుండి వస్తూన్న 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్ని' తానే బహిరంగంగా విమర్శించి, నూతన సమాజ నిర్మాణాన్ని కమ్యూన్లలోనూ, ఫ్యాక్టరీలలోనూ చేపట్టమని పిలుపు ఇచ్చాడు.

అయితే ఈ పోరాటంలో పురోగామి శక్తులు పార్టీలోపల చాలా బలహీనంగా ఉండడం వల్ల అది పటిష్టమైన నిర్మాణం లేకుండా సాగింది. ఆ లోపానికి పరిహారంగా 'వ్యక్తి పూజ' పుట్టుకొచ్చింది. వ్యక్తి పూజను నేను సమర్థించలేదు. సమర్థించడం లేదు. అయితే ఒక నాయకుడు తన వ్యక్తిగత బలాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రోత్సహించే వ్యక్తి పూజకూ, పురోగామి శక్తుల నిర్మాణ బలహీనతకు పరిహారంగా, ఒక చారిత్రక అవసరంగా, ముందుకొచ్చిన దానికీ తేడా చూడడం అవసరం అంటున్నాను. చరిత్రను నిర్దిష్టంగా విశ్లేషించకపోతే మనం తీసుకోగల గుణపాఠాలేవీ ఉండవు.

చైనాలో అన్నీ ప్రజాస్వామికంగా జరిగాయని కాదు. సాంస్కృతిక విప్లవం దాదాపు అంతర్యుద్ధం రూపం తీసుకున్న కారణంగా ఈ దశలో చాలా మంది ప్రాణాలు పోయాయి. అయితే చైనా పార్టీ (మావో బ్రతికి ఉండగా) ఎన్నడూ ప్రజలనూ, ప్రజా ఉద్యమాలనూ అణచివేయలేదు. ప్రత్యర్థులను సోవియట్ రష్యాలోనూ తూర్పు యూరప్‌లోనూ చేసినట్టు బూటకపు విచారణలు జరిపి హతమార్చలేదు. అదే జరిగి వుంటే డెంగ్ ఇన్నాళ్ళూ ప్రాణంతో వుండి తిరిగి అధికారంలోకి రాగలిగి ఉండేవాడు కాదు. (అందుకే లిన్‌పియావోను మావో చంపించాడన్న వదంతి నమ్మశక్యం కాదు.)

కమ్యూనిస్టు పార్టీ పెత్తనం క్రింద ఆర్థిక రంగాన్ని ఆధునీకరించుకుంటూ పోవడమే సోషలిజం కాదని గుర్తించి, నూతన సమాజ నిర్మాణాన్ని నూతన చైతన్యాన్నీ ప్రాతిపదికగా తీసుకొంది. చైనా కమ్యూనిస్టు పార్టీ అయినప్పటికీ ఒక మౌలికమైన ప్రశ్న మిగిలిపోయింది. ఈ విధమైన పురోగమనానికి అనుగుణ్యమైన నిర్మాణం ఏమిటి? సమాజాన్ని పురోగమింపజేసే చైతన్యాన్నీ పౌరవనూ వ్యవస్థీకరించే రాజకీయార్థిక నిర్మాణ రూపాలు ఏ విధంగా ఉండేవి? ఇన్నాళ్ళూ మార్క్సిస్టులు (చైనాలో కూడా) ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పలేదు. నిజానికి ఈ ప్రశ్నను స్పష్టంగా వేసుకోలేదు కూడా. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంగల పార్టీ ఆధిపత్యం ఉంటే అంతా సజావుగానే ఉంటుందని భావించారు. అది తప్పని 30 సంవత్సరాల అనుభవం తెలుపుతూ వుంది. ఈ ప్రశ్నను ఇన్నాళ్ళూ సైద్ధాంతికంగా ఎదుర్కోకపోవడం వల్ల చాలా నష్టం జరిగింది. చాలా మంది ప్రాణాలు, స్వేచ్ఛ పోగొట్టుకున్నారు. అందుకే మార్క్సిస్టులు ఆత్మ విమర్శ చేసుకోవడం అవసరం అన్నాను. ఈ ప్రశ్నను స్పష్టంగా గుర్తించి చర్చిస్తే, మామూలుగా పాశ్చాత్య విమర్శకులు లేవదీసే అనేక ఇతర విషయాలకు— పౌర హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ, మొదలయిన వాటికి— కూడా సమాధానం దొరుకుతుంది. అన్ని సోషలిస్టు దేశాలలోనికీ చైనా అనుభవం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. అయినా అది కూడా సరిపోదు. —— కె. బాలగోపాల్

---

# అది 'జవాబు' కాదు, దాటవేత!

## ఉత్తరాలు

ఫిబ్రవరి 3 'ఉదయం'లో బాలగోపాల్ గారి జవాబు ఇతర పాఠకులకు ఎంత ఆమోదయోగ్యంగా వున్నదో గాని నాకు ఏ మాత్రం ఆమోదించదగ్గదిగా లేదు. ఎంతో సూటిగా వున్న సంఘటనలను కూడా తికమక చెయ్యడానికి ఆయన శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

బాలగోపాల్ గారు (జనవరి 26, 27 ఉదయంలో) తూర్పు యూరపు దేశాల గురించి రాసిన వ్యాసంలో ప్రజల్నించి వాస్తవాలను దాచే ధోరణిని విమర్శిస్తే, అంతే ధోరణి మావో కాలం నాటి చైనా పార్టీలో కూడా వుండేదని నేను లిన్‌పియావో వుదంతం చూపించి, ఈ ధోరణినే బెతల్‌హేమ్, రంగనాయకమ్మ గార్లు విమర్శించిన నాడు దాన్ని బాలగోపాల్ గారెందుకు వ్యతిరేకించారని అడిగాను. దానికి జవాబు చెప్పకుండా దాటవేసి, చైనాకీ తూర్పు యూరపు దేశాలకూ మధ్యవున్న 'తేడాల' గురించి బాలగోపాల్ గారు అసందర్భంగా చెప్పుకొచ్చారు. లిన్‌పియావో ఆనాడు చైనాకి రక్షణ మంత్రి, పార్టీకి ఉపాధ్యక్షుడు మావోకి వారసుడు అంత ప్రముఖుడైన వ్యక్తి ఒకేరోజు నుండి హఠాత్తుగా కనపడకుండా పోతే, ఆ విషయం ఒక సంవత్సరం దాకా పేపర్లలో ప్రకటించలేదంటే, ప్రజల నుండి వాస్తవాలను మరుగుపరిచే పని చైనా పార్టీలో కూడా జరిగినట్టు కాలేదా? ప్రజల నుండి వాస్తవాలను మరుగు పరిచేపని యూరప్ దేశాలలోనే గాని, చైనాలో జరగలేదని బాలగోపాల్ గారు ఇప్పటికీ విచిత్ర వాదం చేస్తున్నారు. లిన్‌పియావో వుదంతం చైనాలో జరిగినదా, తూర్పు యూరప్ దేశాల్లో జరిగినదా? చైనాలో అలా జరగలేదని బాలగోపాల్ గారిచ్చిన జవాబు ఎవరికి ఆమోదయోగ్యం కాగలుగుతుంది?

'మావో పూజ' గురించి కూడా, మళ్ళీ వెనకటిలాగే, ఆ కాలంలో విప్లవ పార్టీలోని లోటు భర్తీ చేయడానికే మావో పూజ వచ్చిందని మళ్లీ అదే సమాధానం ఇచ్చారు. ఏ కాలంలో అయితే విప్లవ పార్టీ లేక మావోపూజ ప్రారంభమైందని బాలగోపాల్ గారంటున్నారో ఆ కాలంలోనే చైనాలో ఎంతో విప్లవ పార్టీ వున్నట్టుగా బాలగోపాల్ గారే ఇంకో సందర్భంగా చాలా వర్ణించారు.

'మావో పూజ ఉధృతంగా సాగినది 1966 నుండి. అదే సాంస్కృతిక విప్లవం ప్రారంభమైన కాలం కూడా. బాలగోపాల్ గారు చైనాలో 1956 నుండి 1969 వరకూ అపూర్వమైన విప్లవ పోరాటాల వెల్లువ ముందుకు వచ్చిందనీ, చైనా పార్టీ ప్రజలను సరైన విప్లవ కార్యక్రమాల ప్రకారం ఆ 13 సంవత్సరాలూ నడిపిందనీ వర్ణించారు. విప్లవ పార్టీ లేకపోవడం వల్లనే దానికి బదులుగా మావోపూజ పుట్టుకొచ్చిందని ఒక చోట చెప్పి, ఆ కాలంలోనే అపూర్వమైన విప్లవ పార్టీ లేకపోవడం వల్ల కాదని తేలిపోతున్నది కదా?

నిరంకుశాధికార ధోరణులు ప్రబలినప్పుడు ప్రజల ముందు వాస్తవాల్ని పెట్టాడని మావోని ప్రశంసిస్తున్నారు బాలగోపాల్ గారు. తన వ్యక్తి పూజ తనే చేయించుకోవడాన్ని మించిన నిరంకుశాధికార ధోరణి ప్రపంచంలో ఇంకేదైనా వుంటుందని నేననుకోను. స్టాలిన్‌ని విమర్శించిన వ్యక్తులు అదేరకం తప్పు చేసినందుకు, ఆ తప్పుకు సంబంధించినంతవరకూ, ఇతర నాయకుల్ని కూడా విమర్శిస్తే అది చిత్తశుద్ధి అవుతుంది.

"మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంగల పార్టీ ఆధిపత్యం వుంటే అంతా సజావుగానే వుంటుందని భావించారు. అది తప్పని 30 సంవత్సరాల అనుభవం తెలుపుతూ వుంది" అంటూ బాలగోపాల్ గారు అన్నిటినీ మించిన ప్రమాదకరమైన వాదం తెచ్చారు. ఒక పార్టీకి నిజంగా, మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం వుండి, దాని నాయకత్వం (ఆధిపత్యం) వుంటే అలా సజావుగానే వుంటుందని చెప్పవచ్చని నేను భావిస్తున్నాను. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం వున్న పార్టీ, తన ఆచరణలో బూర్జువా ధోరణులు లేకుండా చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ ధోరణులను ఎప్పటికప్పుడు విమర్శించుకుంటుంది. ప్రజలకు మార్క్సిస్టు దృక్పథం నేర్పడమే ప్రధాన కర్తవ్యంగా భావిస్తుంది. ప్రజలను ప్రేమిస్తూ, గౌరవిస్తూ, ప్రజలతో ఐక్యమై వుంటుంది. వ్యక్తి పూజలూ, మార్మిక పద్ధతులూ, నాయకులకు ప్రత్యేక సౌకర్యాలు, విలాసాలూ వగైరాల్ని తీవ్రంగా తిరస్కరిస్తుంది. పార్టీకి మార్క్సిస్టు దృక్పథమే వుంటే ఇవన్నీ సాగుతాయి. మార్క్సిస్టు దృక్పథం లేనప్పుడే నాయకులందరూ బూర్జువా ధోరణులతో ప్రవర్తిస్తారు. బూర్జువా నాయకులలాగే ప్రజల్ని నిర్లక్ష్యంచేసి, అగౌరవపరుస్తారు.

కనుక మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంలేని పార్టీల ఆధిపత్యాల వల్ల ఈ నష్టాలన్నీ సంభవిస్తాయి గానీ, ఆ దృక్పథం కలిగిన పార్టీ ఆధిపత్యం వల్ల (నాయకత్వం వల్ల) నష్టాలేమాత్రమూ కలగవు. అంతా సజావుగానే సాగుతుంది. ఒక కమ్యూనిస్టు పార్టీలో భయంకరమైన తప్పులు జరుగుతున్నాయంటే ఆ పార్టీకి మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం లేదనే అర్థానికే రావలసి వస్తుంది. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం గల పార్టీ ఆధిపత్యం వుంటే అంతా సజావుగానే సాగుతుందనుకోవడం తప్పని తేల్చడం ద్వారా బాలగోపాల్ గారు మార్క్సిజానికే తిలోదకాలివ్వవచ్చునని సూచిస్తున్నారు.

మొత్తం మీద, చైనా గురించి గతంలో తను చెప్పిన దంతా సవ్యంగానే వుందని పునరుద్ఘాటించి, అసలైన ప్రశ్నలన్నిటినీ దాటవేశారు.

సంస్కృతి హైదరాబాద్—7